# తీర్పు

రచన:
"మెడికో సత్య"

అక్కడ జనం గుమి గూడేరంటే ఏదో జరిగి వుంటుంది, ఆ కోలాహలం సారం "ఎవరో చనిపోయాట్ట!" పాశ్చాత్య దేశాల్లో ప్రజలు తమ పనులు చేసుకోటానికే సమయం చిక్కక క్రిందా మీదా పడుతుంటారు. యేదైనా విశేషమంటే చాలు పనులన్నీ మానేసి వీక్షిస్తారు మనవాళ్ళు. ఆ దేశాలు మనకంటే ముందుగు పోయాయంటే పోవూ మరి?!

అంతలో ఒక పోలీస్ వేన్ వొచ్చి ఆగింది. సిబ్బందితో జనం మధ్యకి దూకేడు యిన్స్పెక్టర్ శ్రీధర్. కొద్దిసేపటికి శవంచుట్టూ పోలీసులూ, వాళ్ళ చుట్టూ ప్రజలు వలయాల్లా తయారయ్యారు.

ఆ శవం పడివున్న సెంటర్లో రంగడి కిళ్ళీ కొట్టుంది, రావులమ్మ సారా దుకాణం వుంది, ఈరయ్య లాండ్రి, గురవయ్య కిరాణా కొట్టు, దాని ముందు వేసంగిలో మాత్రమే వుండే ఆయనగారి ముద్దులరాణి అప్పలమ్మ చెరకు రసం బడ్డీకూడా వున్నయ్, వీళ్ళందర్నీ పిలిచేడు శ్రీధర్. ఆ చావు గురించి వాళ్ళు చెప్పిన వివరాలని రికార్డ్ చేసి వాళ్ళని ఓసారి స్టేషన్ కొచ్చి కనిపించమని ఆర్డర్ జారీచేసాడు. శవాన్ని వేన్‌లో వేసుకుని స్టేషన్ కి వెళ్ళిపోయాడు శ్రీధర్. జనం ఎవరి దారిన వారు వెళ్ళిపోయారు.

శవాన్ని 'ఐడెంటిఫై' చేసే పనిలో శ్రీధర్ మునిగి పోయాడు. మాసిన ముతక పంచె, రెండుచిన్న చిరుగులున్న సన్న వుంగరాల జుత్తు, ఎడంచేతి మీద 'అంజయ్య' అన్న పచ్చబొట్టు, యివి ఆశవం తనగురించి తాను చెప్పుకున్న వివరాలు. మధ్యాహ్నం రెండున్నర గంటలవేళ గాడ్పులో నడిచి వెళ్తూ సెంటర్లో మెయిన్ రోడ్ మీద పడి వెంటనే ప్రాణాలు విడిచినట్లు సాక్షుల స్టేట్‌మెంట్. యివికాక అతని జేబులో ఓ తాయెత్తు వుంది. లోకల్ ఎంక్వయిరీ పూర్తయి ఆ పేరుగల వ్యక్తి ఆ వూరికి చెందిన వాడు కాదని తేలింది కూడా.

★ ★ ★

అంజయ్యకేమీ పాలు పోవటం లేదు, శూన్యంలోకి చూస్తూ చూరిక్రింద నులక మంచం మీద దిగాలుగా కూర్చున్నాడు.

"ఎన్ని కేకవెయ్యాల గంజ తాగెల్లమని!" అంది లచ్చి, గుమ్మంలోకొచ్చి నిలబడి. ఆమె కేకలు అంజయ్య చెవుల్నే గాని మనసును చేరలేదని ఆమెకేం తెల్సు! అందుకే విసుక్కుంది.

"నువ్వు తాగు, నాకేటోలాగుంది."

రెట్టిస్తే కసిరి కొడతాడని తెల్సు లచ్చికి.

*There is Joy*
*Where there is!!*

HIGH PRESSURE WATER SYSTEM




JOTHI
ENGINEERING WORKS
INDUSTRIAL ESTATE
MADURAI-7.

ATHMAS.

"మాంవా" దగ్గరకొచ్చి నేలమీద కాళ్ళ దగ్గర కూర్చుంది.

"యాండే!" మనసెక్కడో వున్నా యాంత్రికంగా అన్నాడు అంజయ్య.

"సిన్నడింకా సూట్టంలేదు. నాకెందో బయంగావుంది." లేక లేక కల్గిన కొడుకు ఆరోగ్యం గురించి తన ఆందోళన వెలిబుచ్చింది లచ్చి.

యిక పిల్లలు పుట్టవని ఆశ వదిలేసుకున్నాక లచ్చి నీళ్ళోసుకుంది. యిద్దరూ కలలు కన్నట్టు మగబిడ్డన్ని ప్రసవించింది. సిన్నడు వాళ్ళిద్దరి కళ్ళకీ 'బంగారుబాబు' రెండేళ్ళ కాలంలో చెప్పుకో దగ్గ జబ్బేయీ చేయలేదు సిన్నడికి. నాల్గు రోజులక్రితం, రాత్రి ఆడుకుంటూ పడుగున్న సిన్నడు తెల్లారే సరికి చలనం లేకుండా పడివున్నాడు, వొళ్ళు కాలిపోతోంది. మూసిన కన్ను తెరవని సిన్నడ్ని చూసి బావురుమంది లచ్చి. 'దయిర్నం'గా వుండమని చెప్పి మిల్లు కెళ్ళిపోయాడు అంజయ్య.

మధ్యాహ్నం అంజయ్య భోజనానికొచ్చే సరికి సిన్నడి స్థితి మరీ దిగజారింది. లచ్చి కంటికి మంటికీ ఏక ధారగా ఏడ్చి ఏడ్చి పిచ్చిదానిలా తయారయ్యింది.

"మాంవా" అంది వసారా స్తంభాన్ని ఆనుకుని నిలబడి వున్న లచ్చి. తలెత్తి

చూశాడు అంజయ్య ఏమిటన్నట్టు.

"యిందాక సరస్వతొచ్చి సెప్పింది. మొనకటోసారి ఆల్ల రావులికిట్టాగే అయినాదంట. పట్నంలో సాయిబుకాడ కెల్లి తాయెత్తు తెచ్చి కట్టినాదంట. ఎంటనే ఆడు లేసి తిరిగేడంట" అంది లచ్చి.

"డబ్బెంతవుద్దంట?"

"పది రూపాలవుద్దన్నది." సమాచారం మొత్తం వాకబుచేసి వుంచిన లచ్చి వెంటనే సమాధానం చెప్పింది.

పెద్దగా నిట్టూర్చాడు అంజయ్య. ఆ నిట్టూర్పు వెనక భావాలు లచ్చికి తెలుసు.

"కలాఖర్చు యిల్లు గడవటమే కష్టంగా వుంటే పది రూపాయలంటే మాటలా? మన పాణాల విలువ పదిరూపాయలన్నమాట! మనకి తెల్సినవాళ్ళంతా రెక్కాడితేగాని డొక్కాడనోళ్ళు ఆళ్ళేటి సర్దగల్రు?...', యిలాంటి అర్థాలన్నీ ఆ నిట్టూర్పులో నిమిడి వున్నాయని ఆమెకు తెలుసు.

"సేటు కాడకెల్లి నే తెత్తా" అంది. వాళ్ళ








గత
61 సంవత్సరముల
నుంచీ ప్రసిద్ధి
చెందినది.

Phone : 20246
Res : 20124

Grams
"Samadbeedi"

పాత్రలన్నీ మట్టివే. లచ్చికి వాళ్ళమ్మ ఓ యిత్తడి బిందె యిచ్చింది కాపురాని కొచ్చినప్పుడు. ఏదో అవసరం పీకల మీది కొచ్చి దాన్ని దివరకే సేట్ దగ్గర తాకట్టు పెట్టేరు. యిప్పుడు దాని మీదే మరో పదిరూపాయలు తెస్తానంది.

కాలినడకన గంటలో పట్నం చేరిన అంజయ్య తాయెత్తుల సాయిబు యిల్లు సులభంగానే చేరుకున్నాడు. ఆ సాయిబుగారి పాపులారిటీ ఆ ప్రజల మూఢ విశ్వాసాలకి కొలబద్ద! అదే ఓ కవిగారి యిల్లు అయితే ఎవ్వరికీ తెలియదంటారు!

సాయిబుగారి వరండాలో జనం తీర్థప్రజలా వున్నారు. అంజయ్య వంతొచ్చేసరికి చాలా ప్రొద్దెక్కింది. రోగి లక్షణాలన్నీ అడిగి, కాస్సేపు కళ్ళమూసుకుని ఏవో మంత్రాల్లాంటివి నోట్లో గొణుక్కుని ఓ తాయెత్తు అంజయ్య చేతిలో పెట్టేడు. గంటముందే అంజయ్య చేతిలోంచి పదిరూపాయల కాగితం సాయిబుగారి గుమాస్తా చేతిలో పడింది. దాన్నేం చేయాలో చెప్పి వెళ్ళి రమ్మన్నాడు సాయిబుగారు.

మండు వేసవి రోహిణి ప్రభావం ఆరోజు తారా పథాన్నందుకున్నట్టుంది ఎండ. అందరి దేవుళ్ళలా తనకి పూజలు ఒక్కోసారి ఉక్రోషం ఎక్కువయితే ఏడాది పొడుగునా తన ప్రతాపం చూపిస్తాడు!!

గొంతు ఎండి పోతోంది అంజయ్యకి. ఈ గాడ్పులో నడిచి తిరిగి యింటికి చేరగలనా అనిపించింది. సోడా తాగుదా మనిపించి జేబులో తడిమి చూస్తే తాయెత్తు తప్ప పైసా కూడా తగల్లేదు చేతికి.

సెంటర్లో కొచ్చేసరికి అంజయ్యకి కళ్ళు తిరగటం ప్రారంభించాయ్. కిళ్ళీకొట్లో ఎదురుగా కనిపిస్తున్న కూల్ డ్రింక్స్ అమృతభాండాల్లా కనిపించినయ్, సోడాలు, డ్రింక్స్ తాగుతున్న వాళ్ళంతా దేవతలంత అదృష్టవంతులనిపించారు అతని కళ్ళకి. అతని ఆలోచనలు అంతలోనే స్తంభించి పోయాయ్.

రోడ్డుమీద విరుచుకు పడిపోయిన అంజయ్య చుట్టూ జనం ముగారు. ఎవరో సోడానీళ్ళు అతని ముఖం మీద చిలికే లోపునే అంజయ్య అనంతంలో కలిసిపోయాడు.

సిన్నదేమయ్యాడో అంజయ్యకిక తెలియదు. అంజయ్య చావుకి ఆ తాయెత్తు కారణం అంటే ఎందరూపుకుంటారు? తెలియని దాన్ని 'రాత' ఖాతాలో వేసేసే అలవాటున్న మనుషులంతా దీన్ని 'రాత' అనేస్తారు!

